క్లుప్తంగా

చంద్రప్రభ వాహనంపై కల్యాణ వెంకటేశ్వరస్వామి



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి నగర పంచాయతీలోని రామకృష్ణ నగర్‌లో కొలువైన కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీదేవీ భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామ పురవీధుల్లో ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



స్వామి అమ్మవార్ల కల్యాణం

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రం, మహాశివరాత్రి సందర్భంగా తొలుత వేదపండితుల స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల సమక్షంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. నిర్వాహకులు మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

హోరాహోరీగా ఎడ్ల పందేలు

- విజేత అల్లూరు జట్టు



ప్రథమ బహుమతిని అందుకుంటున్న అల్లూరు జట్టు

కోవూరు : మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని లేగుంటపాడులో రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పందేలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. గుణపాటి తులసీరామ్‌రెడ్డి జ్ఞాపకార్థం జరిగిన పోటీలను రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి ప్రారంభించారు. మొత్తం 35 జతల ఎడ్లకు పోటీ జరగ్గా, జిల్లాలోని అల్లూరుకు చెందిన ఎస్ఎస్ బ్రదర్స్ వారు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. రెండో స్థానంలో తూర్పుగోదావరి జిల్లా గుమ్మలేరుకు చెందిన చౌదరి ఎడ్లు, మూడో స్థానంలో కోవూరుకు చెందిన చెన్నకేశవ ఎడ్లు నిలిచాయి. మొదటి బహుమతిగా రూ.50 వేల నగదును గుంటూరుకు చెందిన మిత్రారెడ్డి స్నేహితులు అందజేశారు. కాగా ఎడ్ల పోటీలను తిలకించేందుకు భారీ స్థాయిలో భక్తులు తరలిరావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ట్రైయినీ డీఎస్పీ శివప్రియ, ఎస్సై రంగనాథ్‌గౌడ్ తగిన చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో గుణపాటి హరిప్రసాద్‌రెడ్డి, శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

అల్లూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. 75 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. దేవిరెడ్డి శారద వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ శిబిరానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. భవిష్యత్తులో మరెన్నో మంచి సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం రక్త దాతలను అభినందించారు. డీఎంహెచ్ఓ సుజాత, వైద్యులు కే వెంకటేశ్వర్లు, నవీన్, సింధూజ, రమేష్, ట్రస్ట్ ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, మేనేజర్ అనిల్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఆత్మకూరు: పట్టణంలోని సోమశిల రోడ్ సెంటర్‌లో కారు పార్కింగ్ వద్ద బుధవారం ఉదయం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందజేయగా ఎస్సై షేక్ జిలానీ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బండారుపల్లి గిరిజనకాలనీకి చెందిన మనోహర్‌గా (38) గుర్తించారు. స్థానికులను విచారించగా అతిగా మద్యం సేవించి మృతి చెంది ఉండొచ్చని తెలిపారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అతిగా మద్యం సేవించడం వల్ల లేక మరేదైనా కారణంతో మృతి చెందాడా అన్న విషయాన్ని విచారణలో తేలుస్తామని పేర్కొన్నారు.





పల్లకిపై విహరిస్తున్న మూలస్థానేశ్వరుడు



స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం



హరహర.. మహాదేవ



శంకరమఠంలో..

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి పర్వదినాన్ని నగరంలో భక్తిశ్రద్ధలతో బుధవారం జరుపుకొన్నారు. పార్వతీ, పరమేశ్వరుల దర్శనార్థం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

➡ మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయంలో గిన్నెభిక్ష అలంకారం, లింగోద్భవాభిషేకం, అర్ధరాత్రి ఒంటిగంటకు వెండినందిసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా ప్రత్తి బాలచంద్ర, రాజేష్, రేబాల వెంకటరెడ్డి, పులిమి రమేష్ రెడ్డి, కమలాకర్‌రెడ్డి, దినకర్‌రెడ్డి తదితరులు వ్యవహరించారు. స్వామివారిని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు దర్శించుకున్నారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

➡ సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అర్చనలను నిర్వహించారు. స్వామివారు చందనాలంకారంలో దర్శనమిచ్చారు. పూలంగిసేవ, పంచహారతులు, లింగోద్భవ పూజలు చేశారు.



మూలస్థానేశ్వరాలయంలో విశేషాలంకారం

➡ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలోని మీనాక్షి సుందరేశ్వరస్వామి ఆలయంలో గిన్నెభిక్ష అలంకారం, లింగోద్భవాభిషేకం, నందిసేవను విశేషంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా సులోచనమ్మ, ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, లత, ఆల్తూరు మహేష్‌కుమార్‌రెడ్డి, రాధిక దంపతులు వ్యవహరించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

➡ సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ, అష్టలక్ష్మి మందిర ప్రాంగణంలో గల ఉమాదేవి సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు.

➡ మూలాపేటలోని శంకరమఠంలో మహామృత్యుంజయ అమృత పాశుపత రుద్రహోమాన్ని కంచి కామకోటి పీఠానికి చెందిన వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉభయకర్తలుగా ఉపేంద్రశర్మ దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.



ప్రణమిల్లుతున్న భక్తులు

➡ గణేశ్ ఘాట్ వద్ద కొలువైన స్వర్ణలింగేశ్వరాలయంలో ఏకవార రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, 108 లీటర్ల చెరకు రసంతో అభిషేకం, విశేష ద్రవ్యాలతో రుద్ర హోమం లింగోద్భవకాల అభిషేక పూజలు నిర్వహించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సురేందర్‌రెడ్డి, జనార్దన్‌రాజు తదితరులు పర్యవేక్షించారు.

వేడుకగా మహాదేవ యజ్ఞం



యజ్ఞంలో వనమూలికలను సమర్పిస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రిని పురస్కరించుకొని నగరంలోని పురమందిర ప్రాంగణంలో 108 రకాల వనమూలిక ఔషధాలతో మహాయజ్ఞాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాస్తు నిపుణుడు దువ్వూరు కస్తూరి లీలామోహన్ రెడ్డి పేర్కొన్నారు. సింహపురీయులకు సకలశుభాలు కలగాలని మహాదేవుడ్ని వేడుకుంటూ కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం నుంచి సేకరించిన మహాకుంభమేళ జలాలతో సంప్రోక్షణ జరుపుకొని భక్తుల స్వహస్తాలతో నిర్వహించే మహద్భాగ్యం నెల్లూరీయులకు కలగడం పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. మహాదేవ యజ్ఞానికి ఆరు వేల మందికిపైగా భక్తులు హాజరయ్యారు.



గో పూజ

నిర్మల నరసింహారెడ్డి, రమణారెడ్డి, ధనుంజయరెడ్డి, డాక్టర్ బీవీ రెడ్డి, సుబ్బారెడ్డి, వేమిరెడ్డి కోటారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని డైకస్ రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. పలు అంశాలపై వీరు చర్చించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటారు బైక్ అదుపుతప్పి వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో బుధవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన కృష్ణప్రసాద్ పని నిమిత్తం కసుమూరుకు వెళ్లాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా కసుమూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో కృష్ణప్రసాద్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ విద్యుత్ బకాయిల చెల్లింపు

పొదలకూరు : మేజర్ పంచాయతీ పొదలకూరు విద్యుత్ బకాయిలు చాలాకాలంగా చెల్లించకపోవడంతో పేరుకుపోయాయని విద్యుత్ అధికారులు వీధిలైట్లకు విద్యుత్‌ను కట్ చేసిన విషయం తెలిసిందే. అయితే పంచాయతీ నుంచి తొలివిడతగా రూ.20 లక్షల బకాయిలను చెల్లించినట్లు సెక్రటరీ శ్రీనివాసులు వెల్లడించారు. గురువారం వీధిలైట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇస్తారన్నారు.

చోరీకి యత్నించి.. పక్కరోజు అక్కడే తిరిగి

బుచ్చిరెడ్డిపాళెం : ఓ వ్యక్తి చోరీకి యత్నించి.. పక్కరోజు అక్కడే తిరిగి పట్టుబడిన ఘటన బుచ్చి పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న చోళం నారాయణ అనే వ్యక్తి ఇంటి వద్ద జెండాదిబ్బకు చెందిన చోటూ అనే యువకుడు మంగళవారం అర్ధరాత్రి సీసీ కెమెరాను ధ్వంసం చేసి ఇంట్లో నిద్రిస్తున్న సుదర్శనమ్మ అనే మహిళ మెడలోని బంగారు సరుడును తెంచేందుకు యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో గోడదూకి పరారయ్యాడు. అనంతరం బుధవారం ఉదయం ఏమీ తెలియనట్లు అదే ఇంటికి రాగా సుదర్శనమ్మ దొంగను గుర్తించడంతో చోటూను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ చోటూ గతంలో వారి ఇంటి వద్ద పనిచేసిన వ్యక్తి అని తెలిపారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కళే.. జీవనగమ్యం



శిక్షణ పొందిన మహిళలతో.. (ఫైల్)

- పండరి భజన తొలి మహిళా గురువుగా లక్ష్మీసాయి
- వెయ్యి మందికిపైగా శిక్షణ

నెల్లూరు (బృందావనం): సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ.. పండగలు, జాతర్లలో పండరిభజనలు, కోలాటాలపై మక్కువ పెంచుకున్న ఆమె పసిప్రాయం నుంచే సాధనను ప్రారంభించారు. ఏ విద్యయినా గురు ముఖంగానే సాధన చేయడం పరిపాటి. అయితే ఆమె ఆ కళ సాధనలో నైపుణ్యాలను ఆకళింపు చేసుకొని తనకు తానే గురువుగా, శిష్యురాలిగా నేర్చుకున్నారు. ఏడేళ్ల వయస్సులోనే పండరిభజనలో అగ్నిగుండాన్ని తొక్కి ఔరా అనిపించుకున్నారు. ఆ తర్వాత మరింత కళా నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ మరొకరికి కళను నేర్పే గురువుగా మారారు. ఈ కళపై ఆసక్తి ఉన్న వారికి వివాహానంతరం సైతం శిక్షణ ఇస్తూ.. ఎన్నో వేదికల్లో తన శిష్య బృందంతో పండరిభజనలు, కోలాటాలతో అలరిస్తున్నారు. పండరి భజనలో దాదాపు వెయ్యి మందికిపైగా శిక్షణనిస్తూ తొలి మహిళా గురువుగా లక్ష్మీసాయి కీర్తి ప్రతిష్టలను అందుకుంటున్నారు. బాలాజీనగర్ శివారు పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిర వ్యవస్థాపక ధర్మకర్తల్లో ఈమె ఒకరు.

కళలపై చిన్నతనం నుంచే మక్కువ

వెంకటాచలం మండలం కాకుటూరుకు చెందిన లక్ష్మీసాయి చిన్నతనంలో ఏ కార్యం జరిగినా పండరి భజనలు, కోలాటాన్ని నిర్వహించేవారు. కళలపై మక్కువ పెంచుకున్న ఆమె ఏకలవ్య శిష్యురాలిగా స్వీయ సాధనతో పండరి భజనలు, కోలాట కళలను నేర్చుకున్నారు. ముత్తుకూరుకు చెందిన మధుసూదన్‌రావుతో 21 ఏళ్ల ప్రాయంలో వివాహమైంది. ఇద్దరూ సాయినాథుడి భక్తులు కావడంతో జీవనయానంలో భాగంగా మరో పదేళ్లకు నెల్లూరు చేరారు. సాయిదర్బార్ అద్దాల మందిరాన్ని అకుంఠిత దీక్ష, భక్తిప్రపత్తులతో దేశంలో ఎక్కడా లేని విధంగా నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు 23 ఏళ్లుగా సాయిదర్బార్ అద్దాల మందిరంలో ప్రతి గురువారం జరిగే పల్లకి ఉత్సవంలో పండరి భజనలు, కోలాటాలు చేస్తూ కళను కొనసాగిస్తున్నారు.



పండరిభజనలో శిక్షణ ఇస్తున్న లక్ష్మీసాయి (ఫైల్)

ఉచితంగా శిక్షణ

పండరి భజనపై ఆసక్తి ఉన్న వారిని గుర్తించి ఒక్క రూపాయి తీసుకోకుండా తొలి విడతగా 100 మందికి శిక్షణను అందించారు. వీరితో పండరి భజనలను ప్రతి గురువారం నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు వెయ్యి మందికి శిక్షణ ఇచ్చి కళాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. సాయిదర్బార్ అద్దాల మందిరంలో అగ్నిగుండ మహోత్సవాలను మూడేళ్లుగా నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఏ ఉత్సవం జరిగినా పండరి భజనలు, కోలాటాలను నిర్వహిస్తూ ఎందరో అభినందలు అందుకుంటున్నారు. పండరీపురంలో పాండురంగడ్ని స్మరిస్తూ పండరీ భజనను చేపట్టడం దివ్యానుభూతి అని ఆమె చెప్పారు.

నేత్రపర్వంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రిని పురస్కరించుకొని విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా బుధవారం నిర్వహించారు. సుప్రభాతసేవ, అభిషేకాలు, పూలంగిసేవ తదితరాలను జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘ శాశ్వత వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరు చెంగయ్య ఆచారి, ప్రధాన కార్యదర్శి ఇందుకూరు రమేష్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి బల్లవోలు రమణయ్య, ఉపాధ్యక్షులు అలిమేలి శ్రీహరి, సాధన ప్రభాకర్, కోశాధికారి దండపాణి సురేష్, సంఘ ముఖ్య సలహాదారు అలిమేలి శేఖర్, దేవస్థాన పాలకమండలి సభ్యుడు కందుకూరు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలకు సంపూర్ణ మద్దతు

నెల్లూరు (టౌన్): సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళన చేస్తున్న ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ పూర్తి మద్దతు తెలుపుతోందని జిల్లా అధ్యక్షుడు వెన్ను నరేంద్ర పేర్కొన్నారు. నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. విద్యార్థుల సమస్యలు, అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అధికారులు స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి జీవన్‌ప్రకాష్, యశ్వంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేంద్ర

సమస్యల పరిష్కారానికి కలిసిరావాలి

నెల్లూరు(బృందావనం): సమస్యల సాధన కోసం జిల్లాలో టైలర్ వర్కర్లు సంఘటితంగా కలిసిరావాలని టైలరింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పసుపులేటి యానాదయ్య పేర్కొన్నారు. కాపువీధిలోని అసోసియేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. రెడీమెడ్ దుస్తులతో పోటీని తట్టుకొని పదికాలాల పాటు టైలరింగ్ వ్యవస్థ మనుగడ సాగించాలంటే కార్మికుల మధ్య ఏకాభిప్రాయం అవసరమని చెప్పారు. టైలరింగ్ షాపులకు 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలని కోరారు. టైలరింగ్ ఫెడరేషన్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. మినీబైపాస్ రోడ్డులోని జీపీఆర్ కల్యాణ మండపంలో టైలర్స్ డే వేడుకలను శుక్రవారం నిర్వహించనున్నామని చెప్పారు. అసోసియేషన్ నగరాధ్యక్షుడు గులాం ఖాదర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, జిల్లా కోశాధికారి షేక్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు బాబు, కరీమ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టైలరింగ్ అసోసియేషన్ నేతలు